క్లుప్తంగా

ఆలయ రాజగోపురం నిర్మాణానికి విరాళం


విరాళం అందజేస్తున్న దాతలు

షాద్‌నగర్: పట్టణంలోని లక్ష్మీనర్సింహకాలనీలో ఉన్న శివమారుతీ గీతా అయ్యప్ప మందిరం రాజగోపురం నిర్మాణానికి పట్టణానికి చెందిన మద్దెల జ్యోతి, కుమారస్వామి దంపతులు శనివారం రూ.5లక్షలు, నంద్యాల అనిత, పుల్లారెడ్డి దంపతులు రూ.11,116 విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు విరాళానికి సంబంధించిన చెక్కులను వారు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు లష్కర్ ఆంజనేయులు, రెటికల్ నందీశ్వర్, దాస కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్లు నిర్మించాలి

బీజేపీ మండల అధ్యక్షురాలు రాధిక

కేశంపేట: వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే మహిళలు, ప్రజలకు మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ మండల అధ్యక్షురాలు రొల్లు రాధిక అన్నారు. మండల కేంద్రంలో మరుగుదొడ్లను నిర్మించాలని కోరారు. కార్యాలయాలకు వివిధ పనుల నిమిత్తం వచ్చే వారితో పాటుగా తహసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లకు వచ్చేవారు మరుగుదొడ్లు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. వివిధ గ్రామాలకు వెళ్లేందుకు వచ్చే మహిళా ప్రయాణికులు కూడా మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి మండల కేంద్రంలో అందరికీ ఉపయోగపడే విధంగా పబ్లిక్ మరుగుదొడ్లను నిర్మించాలని కోరారు.

వైద్య ఖర్చులకు ఆర్థికసాయం


నగదు అందిస్తున్న గ్రామస్తులు, నాయకులు

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం మేడిగడ్డ తండాకు చెందిన మధు అనే మహిళ ఇటీవల మృతి చెందింది. దీంతో ఆమె ఇద్దరు 18 నెలల వయసు ఉన్న కవల పిల్లలు అనాథలుగా మారారు. ప్రస్తుతం తాత సంరక్షణలో ఉన్నారు. ఇందులో ఒకరికి ఆరోగ్య సమస్యలు తలెత్తగా.. ఆస్పత్రిలో చేర్పించారు. వైద్య ఖర్చులు భారం కావడంతో.. శనివారం కొందరు గ్రామస్తులు రూ.52,800లను బంధువులకు అందజేసి మానవత్వం చాటుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు మండ్లి రాములు, మాజీ ఎంపీపీ అనిత విజయ్, నాయకులు కృష్ణ, తావుర్య, శంకర్, పాండు, రాజ్‌కుమార్, రమేశ్, మణిపాల్, రఘు తదితరులు ఉన్నారు.

మాకొద్దు ఇందిరమ్మ ఇళ్లు

మంజూరైనా.. నిర్మాణంపై ఆసక్తి చూపని లబ్ధిదారులు

- అధికారులకు రాతపూర్వకంగా లేఖలు
- పునాది స్థాయిలోనే ఆగిన కట్టడాలు


ఎత్‌బార్‌పల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పరిశీలిస్తున్న అధికారులు

మొయినాబాద్: పేదల కలల గూడును సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకం కింద 60 గజాల్లో ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు రూ.5లక్షలు మంజూరు చేస్తారు. నిర్మాణ స్థాయిని బట్టి లబ్ధిదారుల ఖాతాలోనే డబ్బులు జమచేస్తారు. ఈ పథకంతో పేదలందరూ ఇళ్లు నిర్మించుకుంటారని అంతా భావించినా.. క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు విరుద్ధంగా ఉంది. ఇళ్లు మంజూరైన వారిలో సగం మంది లబ్ధిదారులు మాకొద్దు.. ఇందిరమ్మ ఇళ్లు అంటూ అధికారులకు రాతపూర్వకంగానే లేఖలు ఇస్తున్నారు.

50 శాతం మాత్రమే..

మండలంలోని 19 గ్రామ పంచాయతీలకు 500 ఇందిరమ్మ ఇళ్లు, మొయినాబాద్ మున్సిపాలిటీకి 200 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. వీటిలో సగం మందికిపైగా లబ్ధిదారులు ఇప్పటివరకు ఇళ్ల నిర్మాణ పనులే మొదలుపెట్టలేదు. ఇళ్ల నిర్మాణం మొదలుపెట్టాలని అధికారులు లబ్ధిదారులు చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోతోంది. 19 గ్రామ పంచాయతీలకు 500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరుకాగా.. 224 మంది లబ్ధిదారులు మాత్రమే ఇళ్లు నిర్మించుకోవడానికి సముఖంగా ఉన్నారు. 276 మంది లబ్ధిదారులు తాము ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకోలేమని అధికారులకు ఖరాకండీగా చెప్పి లేఖలు రాసి ఇస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలో 200 ఇందిరమ్మ ఇళ్లు మంజూరుకాగా.. ఇప్పటి వరకు 101 మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణానికి ముందుకొచ్చారు. 99 మంది ఇళ్లు నిర్మించుకోలేమని అధికారులకు చెబుతున్నారు.

60 గజాల్లో నిర్మించుకోలేమని..

ఇందిరమ్మ ఇళ్లను 60 గజాల స్థలంలోనే నిర్మించుకోవాలని.. అంతకంటే ఎక్కువ స్థలంలో నిర్మిస్తే బిల్లులు రావని అధికారులు చెబుతున్నారు. ఇళ్ల నిర్మాణ సమయంలో తీసే ఫొటోలను ఏఐతో అనుసంధానం చేయడంతో ఎక్కువ స్థలంలో నిర్మాణం చేపడితే సాఫ్ట్‌వేర్‌లో తీసుకోవడం లేదు. చాలామంది లబ్ధిదారులు 60 గజాల్లో ఇళ్లు నిర్మించుకోవడానికి నిరాసక్తి చూపుతున్నారు. 60 గజాల్లో చిన్న ఇళ్లు నిర్మాణమవుతుందని.. చిన్న ఇళ్లు తమ కుటుంబానికి సరిపోదని భావించి తమకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్లను రద్దు చేయాలని అధికారులకు లేఖలు ఇస్తున్నారు.

అరకొరగానే బిల్లులు..

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్న వారికి సైతం బిల్లులు అరకొరగానే వస్తున్నాయి. మున్సిపాలిటీలో ఇప్పటివరకు 33 ఇళ్లు బేస్‌మెంట్ లెవల్ వరకు నిర్మించారు. మండలంలో 47 ఇళ్లు బేస్‌మెంట్ లెవల్ వరకు పూర్తయ్యాయి. కానీ వాటికి ఇంతవరకు బిల్లులు రాలేదు. పైలెట్ ప్రాజెక్టు కింద మొదలుపెట్టిన వెంకటాపూర్‌లో ఒక ఇళ్లు పూర్తికాగా దానికి రూ.4 లక్షల బిల్లు వచ్చింది. మరో ఆరు ఇళ్లకు బేస్‌మెంట్ లెవల్ వరకు బిల్లులు వచ్చాయి.

ఇళ్లు కట్టుకోవాలని చెబుతున్నాం



ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులందరినీ కలిసి తప్పనిసరిగా ఇళ్లు కట్టుకోవాలనే చెబుతున్నాం. కానీ కొంతమంది కుటుంబ పరిస్థితి, ఆర్థిక ఇబ్బందులతో కట్టుకోలేక పోతున్నామని చెబుతున్నారు. అలాంటి వారి నుంచి రాతపూర్వకంగా లేఖలు తీసుకుంటున్నాం.

–సంధ్య, ఎంపీడీఓ, మొయినాబాద్

మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పనే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో సీసీరోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం సుమారు రూ.22కోట్లతో వివిధ కాలనీల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు స్పష్టం చేశారు. త్వరలో వంద కోట్లతో పట్టణంలో అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు వెల్లడించారు. గత పాలకులు పట్టణాల అభివృద్ధిపై నిర్లక్ష్యంగా వ్యవహరించారని, మాస్టర్ ప్లాన్ రూపొందించలేదని విమర్శించారు. ఫలితంగా చాలా కాలనీల్లో అభివృద్ధి పనులు కనిపించడం లేదన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిలో ప్రజలందరూ పార్టీలకతీతంగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. తద్వారా పట్టణాలు అన్ని రంగాల్లో త్వరితగతిన అభివృద్ధి చెందుతాయన్నారు. కార్యక్రమాల్లో కమిషనర్ సునీత, నాయకులు బాబర్‌ఖాన్, రఘునాయక్, విశ్వం, కొంకళ్ల చెన్నయ్య, విజయ్‌కుమార్‌రెడ్డి, బసిరెడ్డి నరేందర్‌రెడ్డి, శ్రావణి, జమ్రుద్‌ఖాన్, అప్పి, ఇబ్రహీం, ఖాదీర్ తదితరులు పాల్గొన్నారు.


న్యూసిటీ కాలనీలో సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

మొక్కలు అందుబాటులో ఉంచాలి

మండల ప్రత్యేకాధికారి వెంకట్‌నారాయణ

కేశంపేట: వనమహోత్సవంలో నాటేందుకు అవసరమైన మొక్కలను అందుబాటులో ఉంచాలని మండల ప్రత్యేక అధికారి, మెప్మా పీడీ వెంకట్‌నారాయణ అన్నారు. మండల పరిధిలోని చౌలపల్లిలో నర్సరీని, నిర్మాణంలో ఉన్న ఇళ్లను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నర్సరీల్లో ప్రజలకు అవసరమైన మొక్కలు అందుబాటులో ఉంచాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లను నాణ్యతతో నిర్మించుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. ప్రభుత్వం సూచించిన మేరకు ఇళ్ల నిర్మాణాలను చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ కిష్టయ్య, ఏపీఓ అజీజ్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్, మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడ వీరేశ్ తదితరులు పాల్గొన్నారు.


నర్సరీని పరిశీలిస్తున్న వెంకట్‌నారాయణ, తదితరులు

నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలి

ప్రిన్సిపాల్ సాయిసత్యనారాయణరెడ్డి


వీడ్కోలు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

మొయినాబాద్: విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సాయిసత్యనారాయణరెడ్డి సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని చిలుకూరు రెవెన్యూలో ఉన్న అరిస్టాటిల్ పీజీ కళాశాల ఎంబీఏ విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం శనివారం పద్మావతి గార్డెన్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ కష్టపడి చదివి ఉన్నత రంగాల్లో స్థిరపడాలని సూచించారు. సమాజం పట్ల అవగాహన పెంచుకొని బాధ్యతగా నడుచుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో అరిస్టాటిల్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, కేజీరెడ్డి కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నర్సయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మండల పరిషత్‌లో బయోమెట్రిక్


బయోమెట్రిక్ వేస్తున్న సిబ్బంది

కేశంపేట: విధుల్లో పారదర్శకత పాటించేందుకు ప్రభుత్వం ఉద్యోగులకు బయోమెట్రిక్ అటెండెన్స్‌ను ప్రవేశపెట్టింది. అందులో భాగంగా మండల పరిషత్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఎంపీడీఓ స్థాయి నుంచి అటెండర్ స్థాయి వరకు బయోమెట్రిక్ ఏర్పాటు చేశారు. శనివారం నుంచి అధికారులు, సిబ్బంది బయోమెట్రిక్‌లో తమ హాజరును నమోదు చేసుకున్నారు.

తడి, పొడి చెత్తను వేరుగా వేయాలి


దామరగిద్దలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కమిషనర్ వెంకటేశం, సిబ్బంది

మున్సిపల్ కమిషనర్ వెంకటేశం

చేవెళ్ల: ప్రజలు తడి, పొడి చెత్తగా వేరుచేసి మున్సిపల్ సిబ్బందికి అందించాలని కమిషనర్ వెంకటేశం సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని దామరగిద్దలో శనివారం అధికారులు ప్రజలకు తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. అదేవిధంగా సీజనల్ వ్యాధులు, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ప్రజలు ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధికి పన్నుల చెల్లింపులే ముఖ్య ఆధారమని ప్రతి ఒక్కరూ సకాలంలో చెల్లించాలన్నారు. మున్సిపాలిటీలో వార్డుల వారీగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతామన్నారు. ఇప్పటికే మున్సిపాలిటీ అభివృద్ధి కోసం రూ.15కోట్లు నిధులు కేటాయించాలని ప్రతిపాదనలు పంపించామని స్పష్టం చేశారు. ఒక్కొక్కటిగా అన్ని సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో మేనేజర్ రాఘవేందర్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ పింఛన్లు మంజూరు చేయాలి

ఇబ్రహీంపట్నం: పెండింగ్ పింఛన్లను తక్షణమే మంజూరు చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి జెర్కోని రాజు డిమాండ్ చేశారు. వికలాంగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం తహసీల్దార్ సునితరెడ్డికి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 43.02 లక్షల మంది వికలాంగులు ఉండగా.. అందులో 24.85 లక్షల మంది చేయూత పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. కానీ ప్రభుత్వం ఇంత వరకు మంజూరు చేయలేదని విమర్శించారు. మరొకరిపై ఆదారపడిన వారికి చేయూత నివ్వాల్సిన ప్రభుత్వం.. వారి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. పంచాయతీరాజ్, మున్సిపల్ చట్టాలను సవరించి, స్థానిక సంస్థల్లో ప్రాతినిథ్యం కల్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నేతలు పాల్గొన్నారు.

కేశంపేట ప్రత్యేకాధికారిగా వెంకట్‌నారాయణ



కేశంపేట: మండల ప్రత్యేకాధికారిగా మోప్మా పీడీ వెంకట్ నారాయణ శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ బాధ్యతలు నిర్వర్తించిన ఏడీఏ రాజారత్నం పదోన్నతి పొంది బదిలీ అయ్యారు. అనంతరం జిల్లా సివిల్ సప్లయ్ అధికారి గోపీకృష్ణను నియమించారు. కొద్దిరోజులు మాత్రమే గోపీకృష్ణ విధులు నిర్వర్తించారు. కొత్తగా మోప్మా పీడీ వెంకటనారాయణను కలెక్టర్ మండల ప్రత్యేకాధికారిగా నియమించారు. ఈ సందర్భంగా అధికారులతో పాటుగా మాజీ ప్రజాప్రతినిధులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రత్యేక చట్టం తీసుకురావాలని వినతి

శంకర్‌పల్లి: స్థానిక సంస్థల్లో దివ్యాంగులకు ప్రాతినిధ్యం ఉండేలా ప్రభుత్వం ఒక ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని దివ్యాంగుల జాతీయ హక్కుల సంఘం చేవెళ్ల నియోజకవర్గ అధ్యక్షుడు కాసాల యాదయ్య డిమాండ్ చేశారు. దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం ఆయన తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ బాలకృష్ణారెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 43 లక్షల మంది దివ్యాంగులు ఉండగా.. వారిలో 24.85లక్షల మంది చేయూత పెన్షన్స్ కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. అదేవిధంగా దివ్యాంగుల కార్పొరేషన్‌ను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం ఆలోచనలు చేయాలని కోరారు. తమిళనాడు, రాజస్థాన్, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల్లో దివ్యాంగులకు స్థానిక సంస్థల్లో ప్రాతినిధ్యం ఉండేలా ప్రత్యేక చట్టం తీసుకొచ్చారన్నారు. అదేవిధంగా తెలంగాణలోనూ అదే రకమైన చట్టం తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో దివ్యాంగుల జాతీయ హక్కుల సంఘం మండల అధ్యక్షుడు బిర్ల పెద్దకుమార్, నాయకులు ఎస్.కుమార్, దత్తు, శ్రీనివాస్, శీతల్‌సింగ్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.


డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న దివ్యాంగులు

మూగజీవాల పెంపకంలో జాగ్రత్తలు అవసరం

మండల పశువైద్యాధికారి శిరీష

చేవెళ్ల: మూగజీవాల పెంపకంలో పాడి రైతులు సరైన జాగ్రత్తలు తీసుకోవటంతో పాటు అవగాహన కలిగి ఉండాలని మండల పశువైద్యాధికారులు శిరీష, దేవేందర్ రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని పలుగుట్ట వార్డులో, మండలంలోని ఆలూరు గ్రామాల్లో శనివారం పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో జూనోసెస్ డే సందర్భంగా జూనోటిస్ వ్యాధులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతీ సంవత్సరం జూలై 6వ తేదీన ప్రపంచ జూనోసెస్ డేగా నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ప్రజలు, రైతులకు ఈ వ్యాధులపై అవగాహన కల్పించి అప్రమత్తం చేస్తున్నట్లు తెలిపారు. ఇవి అంటువ్యాధులనీ, వైరస్, బ్యాక్టీరియా, పరాన్నజీవుల నుంచి వ్యాపిస్తాయన్నారు. జంతువుల నుంచి మనుషులకు ఈ వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఈ వ్యాధులు జంతువులలో ప్రత్యక్షంగా లేదా పరోక్ష తాకిడి, వెక్టర్–బోర్న్ లేదా ఆహారం ద్వారా వ్యాప్తి చెందుతాయన్నారు. మూగజీవాలను పెంచే వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పాడి రైతులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. దీంతో పాటు రేబీస్ వ్యాధిపై అవగాహన కల్పించారు. పెంపుడు కుక్కలు, పిల్లులకు అంటీరేబీస్ వ్యాక్సిన్ వేయించాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు, ప్రజలు, ఉపాధ్యాయులు, వెటర్నరీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


జూనోటిక్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శిరీష

బడిబాటతో సత్ఫలితాలు!

- ఎల్గొండగూడ పాఠశాలలో 31 మంది అడ్మిషన్లు
- ప్రైవేట్ నుంచి సర్కారు బడికి వలసలు
- ఆదర్శంగా నిలుస్తున్న సిబ్బంది


ఎల్గొండగూడ ప్రాథమిక పాఠశాలలో ప్రార్థన చేస్తున్న విద్యార్థులు

షాబాద్: ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలు పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. మండల పరిధిలోని ఎల్గొండగూడ ప్రాథమిక పాఠశాల ఇతర పాఠశాలలకు ఆదర్శంగా నిలుస్తోంది. ఈ పాఠశాల ఉపాధ్యాయుడు చదువుతో పాటు విద్యార్థుల్లో దేశ భక్తి పెంపొందించేందుకు కృషి చేస్తున్నారు. సర్కార్ బడుల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు చేపట్టిన బడిబాట మండలంలో సత్ఫలితాలనిస్తోంది. సర్కార్ బడుల్లో విద్యార్థులను చేర్చేందుకు ఉపాధ్యాయులు గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి ప్రచారం చేసి పాఠశాలల్లో సౌకర్యాలను వివరించారు.

ఇంటింటా తిరిగి.. అవగాహన కల్పించి..

మండలంలోని ఎల్గొండగూడ ప్రాథమిక పాఠశాలలో గతంలో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు బోధన సాగేది. కానీ ఊరిలో పిల్లలంతా ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లడంతో ప్రభుత్వ పాఠశాలలో 8 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. ఈ సంవత్సరం పాఠశాల హెచ్‌ఎం మల్లేశ్‌గౌడ్ ప్రైవేట్ పాఠశాలకు వెళ్తున్న విద్యార్థుల ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడి 31 మంది విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. మొత్తం 39 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. మూతపడే స్థాయికి వచ్చిన పాఠశాలకు పూర్వ వైభవం తీసుకొచ్చిన ఉపాధ్యాయుడు మల్లేశ్‌గౌడ్‌ను గ్రామస్తులు అభినందించారు. పిల్లలను సర్కార్ బడికే పంపించాలని ఇంటింటా తిరిగారు. చిన్నారుల భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దుతామని తల్లిదండ్రులను ఒప్పించారు.

పూర్వ వైభవం దిశగా..

ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో అన్ని సౌకర్యాలు కల్పించారు. బడిలో టాయిలెట్లు, ప్రహరీ, గేటు లాంటి సమస్యలను గ్రామస్తులు దాతలుగా ముందుకొచ్చి ఏర్పాటు చేశారు. పాఠశాలలో బోధన, మధ్యాహ్న భోజనం ఎలా ఉందో చిన్నారుల తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఏమైనా సమస్యలుంటే ఉపాధ్యాయులు, పేరెంట్స్‌తో చర్చించి నివృత్తి చేసుకుంటున్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కలిసి ప్రభుత్వ పాఠశాలకు పూర్వ వైభవం తీసుకురావడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


ప్రచారం నిర్వహిస్తున్న హెచ్‌ఎం మల్లేశ్‌గౌడ్, గ్రామస్తులు(ఫైల్)

సహకారం అందిస్తాం



ఎల్గొండగూడ ప్రాథమిక పాఠశాలకు పూర్వవైభవం తీసుకొచ్చేందుకు ఉపాధ్యాయులతో కలిసి ఇంటింటికీ తిరిగి విద్యార్థులను పాఠశాలకు వచ్చే విధంగా అవగాహన కల్పించాం. 31 మంది పిల్లలను ప్రైవేట్ పాఠశాలకు వెళ్లకుండా సర్కార్ బడిలో చేర్పించారు. పాఠశాల బలోపేతానికి గ్రామస్తులందరం సహకారం అందిస్తాం.

– రవీందర్‌రెడ్డి, ఎల్గొండగూడ

పాఠశాలను బలోపేతం చేస్తాం



మూతబడే స్థాయికి వచ్చిన పాఠశాలకు పూర్వ వైభవం తీసుకొచ్చాం. విద్యార్థుల భవిష్యత్‌కు భరోసా కల్పించాం. గ్రామస్తులు, తల్లిదండ్రులు తమపై నమ్మకంతో 31 మంది ప్రైవేట్ పాఠశాల వెళ్లకుండా విద్యార్థులను సర్కారు బడికి పంపించారు. మొత్తం 39 మంది విద్యార్థులకు ప్రత్యేక శ్రద్ధ వహించి నాణ్యమైన బోధన అందిస్తాం.

– మల్లేశ్‌గౌడ్, హెచ్‌ఎం, ప్రాథమిక పాఠశాల